ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023
5
విజయనగరం



పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పుచెప్పిందని ఎస్‌పి ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో చీపురుపల్లి పోలీసు స్టేషనులో నమోదైన ఈకేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. గరివిడి గ్రామం ఫేకర్ క్వార్టర్స్‌కు చెందిన కాకర్లపూడి రామ్ కుమార్ వర్మ (24) బాలికపై ప్రేమ పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించి, బెదిరించి, పలుమార్లు లైంగిక నేరానికి పాల్పడడంతో చీపురుపల్లి పోలీసు స్టేషనులో పోక్సో చట్టం ప్రకారం అప్పటి ఎస్‌ఐ క్రాంతి కుమార్ కేసు నమోదు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు జడ్జి కె. నాగమణి 20ఏళ్ల పాటు కఠిన జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్‌పి తెలిపారు.

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా

మూడు గ్రామాల మధ్య బోడి కొండపై తవ్వకాలు

అత్యంత విలువైన యాంబర్ గోల్డ్ రకం గ్రానైట్ తవ్వితీస్తున్న వైనం

అనుమతులున్నాయని బుకాయింపు

మండలంలోని మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. ఎటువంటి అనుమతులూ లేకుండానే ఇష్టానుసారంగా బోడి కొండను కొల్లగొడుతున్నారు. పైపెచ్చు ఎవరైనా ప్రశ్నిస్తే అనుమతులున్నాయని బుకాయిస్తున్నారు. ఈ విషయమంతా అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. స్థానిక నాయకులు కూడా పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని మిన్నకుండిపోయినట్లు తెలిస్తోంది. దీంతో మాఫియా ఇష్టానుసారంగా కొండను డొల్ల చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బోడికొండపై జరుగుతున్న గ్రానైట్ తవ్వకాలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని మధుపాడ, అలుగోలు, జోగిరాజుపేట గ్రామాల సరిహద్దులోగల బోడి కొండను మైనింగ్ మాఫియా ఎటువంటి అనుమతులూ లేకుండానే తవ్వేస్తున్నారు. అత్యంత విలువైన యాంబర్ గోల్డ్ రకం గ్రానైట్ రాయిని తవ్వి తీస్తూ ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సర్వే నెంబర్ 34లో 3.5 హెక్టార్లకు అనుమతులు తీసుకున్నామని నమ్మిస్తున్న మాఫియా గ్యాంగ్ అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలోనే తవ్వేస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

2010లో అనుమతులు తీసుకున్నారట !

అనుమతులు లేకుండా ఎందుకు కొండను తవ్వేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే 2010లో అనుమతులు తీసుకున్నామని చెబుతున్నారు. అయితే కనీసం గ్రామసభ పెట్టకుండా స్థానిక నేతల నోళ్లను ఆమ్యామ్యాలతో మూయించి, గ్రామస్తులను ఏమార్చిన మైనింగ్ బడాబాబులు గత ఆరు నెలలుగా మొత్తం బోడి కొండను తవ్వేస్తున్నారు. కాగా మైనింగ్ తవ్వకాలకు రహదారి కోసం రైతుల జిరాయితీ భూములను సైతం కబ్జా చేసి పచ్చని చెట్లను నేలకూల్చి, వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రశ్నిస్తే రాజకీయ నేతల పేరుతో బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

రాత్రి సమయాల్లో తరలింపు

పగటి పూట తవ్విన గ్రానైట్ అంతా రాత్రి సమయాల్లో పెద్ద పెద్ద కంటైనర్లతో బయటకు తరలించేస్తున్నారు. వారు చెప్పినట్లే అన్ని అనుమతులూ ఉంటే గప్ చుప్‌గా రాత్రి పూట ఎందుకు తరలిస్తున్నారని పలు అనుమానాలు వ్యక్తం మవుతున్నాయి.

బోడి కొండతో ఆ ప్రాంత ప్రజలకు విడదీయలేని బంధం

ఈ మూడు గ్రామాల మధ్య ఉన్న ఈ బోడి కొండతో ఆ ప్రాంత ప్రజలకు విడదీయరాని బంధం ఉంది. పశువుల మేతకు, వ్యవసాయ క్షేత్రంగా బోడి కొండను ఉపయోగిస్తోన్న రైతులు ఈ తవ్వకాలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండను ఆనుకొని ఉన్న డి-పట్టాదారులను కూడా మాఫియా కొనేసి ఏకంగా తవ్వకాలు చేస్తున్నట్లు తెలిస్తోంది. జోగిరాజుపేట, మధుపాడ, బొప్పడాం, పినతరిమి గ్రామాల భూభాగంతో కలిసి ఉన్న బోడి కొండ ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అంతా నేతల కనుసన్నల్లోనే ..

ఈ మూడు గ్రామాలకు చెందిన స్థానిక నేతల కనుసన్నల్లోనే బోడికొండ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొంత మంది రైతుల నుంచి తీసుకున్న భూములకు, వాటి వల్ల పంట నష్టపోతున్న రైతులకు పరిహారం ఇవ్వకుండా మాఫియా దాటవేస్తుందని, పరిహారం ఇవ్వకపోతే చిన్న రాయిని కూడా వెళ్లనీయబోమని రైతులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని మైనింగ్‌పై చర్యలు తీసుకుని పశువులకు ఆధారంగా ఉన్న బోడి కొండ తవ్వకాలను నిలిపివేయాలని ఆ మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తరలింపునకు సిద్ధంగా ఉన్న గ్రానైట్ పలకలు

27నుంచి కులగణన : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం



వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుసుకొనే లక్ష్యంతో ఈనెల 27 నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణన ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే జరుగుతుందని, దీనికి యంత్రాంగం సిద్ధం కావాలని ఆదేశించారు. కుల గణన-2023పై టెలీకాన్ఫరెన్స్ ద్వారా గురువారం శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకోవడం కోసం కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపడతాయని పేర్కొన్నారు. బలహీన, వెనుకబడిన వర్గాల వారికి మరింత మేలు జరుగుతుందని చెప్పారు. కులగణన గురించి ముందుగానే వలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి, అపోహలను తొలగించా లని సూచించారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను అడగనవసరం లేదని స్పష్టం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, ఎవరి కులం వారికే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే, వారిని బలవంతం చేయవద్దని స్పష్టం చేశారు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందని, దీనిని ఏ ప్రయివేటు సంస్థకు, వ్యక్తులకు వెళ్లడించడం జరగదని చెప్పారు.

కుల గణనలో భాగంగా నవంబర్ 27 నుండి వారం రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారని కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుండి ఎంపిక చేసిన సూపర్‌వైజర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తా రన్నారు. గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారని తెలిపారు. ముందుగానే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన గురించి వివరించాలని సూచించారు. మండల స్థాయిలో తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, మండల ప్రత్యేకాధికారులు ఈ సర్వేని పర్యవేక్షిస్తారని తెలిపారు. వివరాలను నమోదు చేయడం కోసం ప్రత్యేక యాప్ త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. వివిధ కుల సంఘాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘాలను పిలిచి కులగణన గురించి వివరించాలని సూచించారు. ప్రతీ వ్యక్తి వివరాలు నమోదు చేసినప్పుడు వారి ఇకెవైసి తప్పనిసరిగా చేస్తారని. వయసు 8ఏళ్ల లోపు ఉన్న వారికి ఇకెవైసి తప్పనిసరి కాదని తెలిపారు. ప్రతీ కుటుంబానికి సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయం సిబ్బంది బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్‌మిట్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెసి మయూర్ అశోక్, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, సిపిఒ పి.బాలాజీ, డిపిఒ నిర్మలాదేవి, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తాహశీల్దార్లు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉడా కాలనీ సబ్‌స్టేషన్‌లోగల 33/11కెవి ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి సాయిబాబా టెంపుల్ వద్ద చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వుడా ఫేస్-1,2,3,4లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం వైసిపికి లేదు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి,జనసేన నాయకులు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా, విభజన హామీలు అమలు చేయక పోయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం వైసిపికి లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో టిడిపి, వైసిపి సమన్వయసమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాన్ని అశోక్‌గజపతిరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని ఆవిష్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు రానున్న రోజుల్లో మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. అసలు రాష్ట్రంలో ప్రజా ప్రతినిధులు ఉన్నారా లేరా అనే సందేహం కలుగుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం వెన్నుముక లేకుండా ఉందన్నారు. చంద్రబాబును ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్ని ఇబ్బందులు పెట్టారన్నారు. ప్రజాధనాన్ని మింగేసి జైలుకు వెళ్లిన దొంగ నేడు పాలన చేస్తున్నారన్నారు. అలాంటివారికి బెదిరింపుల మనస్తత్వం కాకుండా ఇంకా ఏమి ఉంటుందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నుండి రావాల్సిన హక్కులు కోసం పదవులు కూడా వదులుకున్నామన్నారు. ఈ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు కూడా వేరే వాటికి బదిలీ చేసి ఆ లబ్ధిదారులకు అన్యాయం చేస్తుందన్నారు. యశస్విని మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఒక్కప్పుడు ప్రశాంతంగా ఉండే విజయనగరం నేడు అనేక సమస్యలతో సతమతమవుతోందన్నారు. మళ్లీ దొంగను ప్రోత్సహిస్తే రాష్ట్రం నాశనం అవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్, బంగారు బాబు, జనసేన నాయకులు జి.శాంతి,రౌతు సతీష్ పాల్గొన్నారు.

పాత్రికేయ వృత్తి పవిత్రమైనది

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట



కల్యాణ్‌రామ్‌ను సత్కరిస్తున్న ఛాన్సలర్ రాజు తదితరులు

సమాజానికి చుక్కానిగా వ్యవహరించే పాత్రికేయ వ్యవస్థ అత్యంత పవిత్రమైనదని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో జరిగిన జాతీయ పత్రికా దినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలుగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగానికి సేవలు అందిస్తున్న అనకాపల్లికి చెందిన కాండ్రేగుల కళ్యాణ్ రామ్‌కు 2023 సంవత్సరానికి జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముందుగా సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు జ్యోతి ప్రజ్వలనం చేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 200 మంది ఇంజనీరింగ్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, పతకాలను ప్రదానం చేశారు. ఉత్తమబుక్ రీడర్స్ గా నిలిచిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాల యానికి చెందిన 20 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసుమంచి సుబ్బారావు,ప్రముఖ వైద్యులు డాక్టర్ సన్యాసమ్మ ,ట్రైబల్ యూనివర్సిటీ ఎఒ డాక్టర్ సూర్య నారాయణ, ఎం సుభద్రాదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి



రూ.7కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుమారు రూ.7కోట్లతో పలు డివిజన్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. గురువారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సాధారణ, అత్యవసర సమావేశాలు జరిగాయి. పలు అంశాలపై సభ్యులు చర్చించారు. సాధారణ సమావేశంలో పొందుపరిచిన 17 అంశాలకు, అత్యవసర సమావేశంలో పొందుపరిచిన 5 అంశాలకు ఆమోదం తెలిపారు. సభ్యులు తీర్మానించిన 3అంశాలకు ఆమోదం లభించింది. అనంతరం మేయర్ విజయలక్ష్మి

నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి : మేయర్

మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో నగరంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని సుందరీకరణ పనులు పూర్తయ్యాయని, దీంతో నగరం ఆకర్షణీయంగా కనిపిస్తోం దన్నారు. ఈనెల 27 నుంచి నగరంలో జరుగనున్న కుల గణనకు అందరూ సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఈనెల 19న ప్రపంచ క్రికెట్ కప్ మ్యాచ్‌ను మహిళా పార్కులో పెద్ద తీరపై నుండి మహిళలు తిలకించే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. కుక్కలకు గర్భనిరోధక శస్త్ర చికిత్సలు చేసినప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ రహదారులపై విచ్చలవిడి ఆక్రమణలు లేకుండా నిరంతరం పర్యవేక్షించే విధంగా అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, కోఆప్షన్ సభ్యులు ఆసపు వేణు, అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న వాగ్దాన భంగాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 20న సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు తెలిపారు. గురువారం పాల ఆసుపత్రి వద్ద గోడపత్రిక విడుదల చేస్తూ ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి రాగానే అందర్నీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన జగన్ నాలుగున్నరేళ్లయినా పర్మినెంట్ చేయకపోగా ఆప్కాస్‌లో చేర్చి కార్మికులను శాశ్వత బానిసలుగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జరిగే నిరసనదీక్షలు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అశోక్, వంశీ, సూరి పాల్గొన్నారు.

అన్నిటికంటే గొప్పది అవయవ దానం

ప్రజాశక్తి-విజయనగరంకోట

అవయవదానం అన్నిటికంటే గొప్పదానమని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గాజుల రేగ శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శాఖ గ్రంథాలయ అధికారి ఎం. లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు ముందుగా అవయవదానం వల్ల కలిగే మేలును విద్యార్థులకు వివరించారు. ఉదాహరణకు కళ్ళు దానం చేస్తే అవతల వ్యక్తికి ప్రపంచాన్నే చూపించగలిగే వ్యక్తుల మవుతామన్నారు. గుండె దానం చేస్తే మన గుండె చప్పుడు వాళ్ళ బతుకు చప్పుడు అవుతుందని అన్నారు. పర్యవేక్షకుడిగా స్థానిక గాజుల రేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు వ్యవహరించారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్‌పి హైస్కూల్, నారాయణ పబ్లిక్ స్కూల్ ఉన్నత విద్యార్థులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు మద్దతుగా నిలవాలి

విజయనగరంకోట : పాలస్తీనాకు మనమంతా మద్దతుగా నిలబడాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణప్రభాత్ అన్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా జెవివి, సాహితీస్రవంతి ఆధ్వర్యాన బుధవారం రాత్రి గురజాడకేంద్ర గ్రంథాలయంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్ నేడు పాలస్తీనాను హమాస్ ఉగ్రవాద సంస్థగా చూపి పాలస్తీనా సామాన్య ప్రజల్ని మట్టు పెడుతున్నారని ఆవేదన చెందారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ ఇలాంటి విపత్కర సమయంలో ప్రజలంతా పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. కవులు పాయల మురళీకృష్ణ, లండ సాంబమూర్తి, శ్రీనివాసాచార్య, ప్రసాదమూర్తి, జి.వెంకట రమణ తమ కవితలు ద్వారా ఇజ్రాయిల్ దమనకాండను వివరించారు.

పిఎంవివై ద్వారా రూ.3లక్షలు వరకు రుణాలు


ప్రజాశక్తి-విజయనగరం

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా మైనారిటీ లబ్ధిదారులుకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉమ్మడివిజయనగరం జిల్లా కార్య నిర్వాహక సంచాలకులు టి.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ వర్గాలకు ఆర్థికంగా ఆదుకునే దిశగా ఆలోచించి, జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అర్హులైన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకానికి మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన 18 రకాల వృత్తిపని వారు అర్హులని పేర్కొన్నారు. సాంప్రదాయ కులవృత్తులైన వడ్రంగి, బంగారు ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు, శిల్పాలు విగ్రహాలు తయారు చేసే వారు, బుట్టలు, చాపలు, మట్టి పాత్రలు తయారు చేసే కుమ్మరి వారు, చీపుర్లు తయారీదారులు, దోబీ, టైలర్, చేప వలను తయారు చేయు వారు, చెప్పులు కుట్టేవారు, తాపీ కార్మికులు క్షవర వత్తిదారులు, సంప్రదాయ బొమ్మలు,పూల దండలు, రజకులు పడవల తయారీదారులు, ఇంటి తాళాలు తయారీదారులు అర్హులని తెలిపారు. తమ ధ్రువపత్రాలను తీసుకెళ్లి మీసేవా , సిఎస్ సి కేంద్రాల్లో www.pmvishwakarma.gov.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటిలో ఒకరు మాత్రమే అర్హులని, ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే పథకానికి అనర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నాక మూడు దశల్లో స్క్రీనింగ్ చేసి సెలెక్ట్ చేస్తారని, అర్హత పొందిన వారికి 15 రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు.

పైప్ లైన్ పనులకు కోలగట్ల శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పద్మావతి నగర్ ప్రాంతంలోని వసంత విహార్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం శంకుస్థాపన చేశారు. రూ.6.86 లక్షల రూపాయల వ్యయంతో పైపులైన్ పనులను నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. పనులు పూర్తయిన తర్వాత ఆ ప్రాంత వాసులందరికీ తాగునీటి సదుపాయం కలగనుంది. ఈ సందర్భంగా 31, 32 డివిజన్ల కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతి రావు మాట్లాడుతూ వసంత విహార్ వాసులకు ఎన్నో ఏళ్ల నాటి కల సాకారం అయిందని అన్నారు. ఇప్పటికే 31వ డివిజన్లో 4.50 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. మేయరు విజయలక్ష్మి, జోనల్ ఇన్చార్జిలు అప్పారావు, మారం బాల బ్రహ్మారెడ్డి, వసంత విహార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

బాక్సింగ్ క్రీడా కారులకు కోలగట్ల అభినందన

క్రీడా స్ఫూర్తితో నగరానికి మరింత ఖ్యాతిని తీసుకురావాలని బాక్సింగ్ క్రీడాకారులను ఉద్దేశించి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు మూడో స్థానంలో నిలిచారు. విశాఖపట్నంలో జరిగిన ఈ పోటీలలో రెండు రజిత, మూడు కాంస్య పథకాలను సాధించారు. క్రీడాకారులను అభినందిస్తూ పథకాలను, ప్రశంస పత్రాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వగృహంలో అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు సీతారామాంజ నేయులు, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత

వైసిపిబస్సుయాత్రలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-రాజాం

సామాజిక, ఆర్థిక సాధికారత ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర గురువారం సాయంత్రం రాజాంలో ఎమ్మెల్యే కంభాల జోగులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు మాట్లాడారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను జగన్ గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. అధికారం కోసం కాదు ప్రజల సంక్షేమ గురించి ఆలోచించే నాయకుడు జగన్ అని, వెనుకబడిన వర్గాలు ఇవాళ తలెత్తుకుని బతుకుతున్నారని ఉద్ఘాటించారు. నాడు- నేడుతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో అన్నీ స్కాములేనని, ఓటు వేయని వారికీ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌దేనని పేర్కొన్నారు. చంద్రబాబు ఏనాడూ ప్రజల గురించి ఆలోచించలేదని అన్నారు.

మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల్లో జగనన్న ప్రభుత్వం సాధించిన సాధికారతను చెప్పేందుకే, జగనన్న సువర్ణ పరిపాలన మళ్లీ రావాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. వైసిపిజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వెనుకబడినవర్గాలకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం 50శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు పరిశీలించారు. ముందుగా ఎంఆర్ కాలేజ్ సమీపంలో ఉన్న బుద్ధ విగ్రహం ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించాలని ఆదేశించారు. సమీపంలో ఉన్న సీవేజ్ ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం వైయస్సార్ జంక్షన్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. కెఎల్ పురంలో నూతనంగా నిర్మితమవుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. పర్యటనలో ఇన్చార్జి ఇఇ దక్షిణామూర్తి ఎంహెచ్ఒ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

విజయనగరం : ఈనెల 3వ వారంలో జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. దీనిలో భాగంగా ప్రచార రథం జిల్లా అంతటా తిరుగుతుందని, దీనికి రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ఉద్దేశించిన ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.కేంద్ర పథకాలకు అర్హుల పేర్లు నమోదు చేసుకొని, వారికి పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

ఇపిఎస్ ఉద్యోగులకు రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలి

నెల్లిమర్ల: ఇపిఎస్ ఉద్యోగులకు 9వేలు పెన్షన్ ఇవ్వాలని పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అజయ్ కుమార్, శ్రీనివాస శాస్త్రి సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరిని కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దేశంలో 75లక్షల మంది ఈపిఎస్ ఉద్యోగులుండగా వారికి రూ. 1000 నుంచి రూ.5వేలు మాత్రమే పెన్షన్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఈపిఎస్ ఉద్యోగులకు రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలని వారికి ఉచిత వైద్య సౌకర్యం కల్పించి ఈపిఎస్ నిధులను షేర్ మార్కెట్‌కి తరలించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గాయపడిన కార్యదర్శికి ఆర్థిక సాయం

నెల్లిమర్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సతివాడ పంచాయతీ కార్యదర్శి శంకరరావుకు మండల పంచాయతీ కార్యదర్శులంతా కలిసి ఆర్థిక సాయం అందించారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న శంకరరావును గురువారం పరామర్శించి రూ. 1.39లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వై. రమణ, కె. భాస్కర్ రావు, ఏ. సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న కార్యదర్శులు

శ్మశానాల్లో సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి: నియోజకవర్గంలో ముస్లిం శ్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ను మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ కోరారు. విశాఖ కలెక్టరేట్‌లో ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ను కలిసిన రియాజ్ ఖాన్ ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ను సత్కరించారు.

వాహనాలకు జిపిఎస్ అవసరం

బొబ్బిలి: ఈ సారి ధాన్యం కొనుగోలు వ్యవస్థలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి సంబంధిత మిల్లుకు చేరవేసే ప్రతి వాహనానికి జిపిఎస్ పరికరం తప్పనిసరిగా ఉండాలని ఏడి మజ్జి శ్యామసుందరరావు అన్నారు. గురువారం మండలంలోని అలజంగి, కారాడ గ్రామాల్లో ధాన్యం రవాణా కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, వాహనాలకు జిపిఎస్ పరికరాలను అమర్చారు. ధాన్యం తరలించే ప్రతి వాహనానికి విధిగా ఈ జిపిఎస్ పరికరాన్ని అమర్చుకోవాలన్నారు. ఈ పరికరం అమర్చిన వాహనానికి మాత్రమే ట్రక్ షీట్ ఇస్తారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 72 వాహనాలకు జిపిఎస్ పరికరాన్ని అమర్చామన్నారు. గతేడాది మండలంలో ధాన్యం రవాణా కోసం 396 వాహనాలను ఉపయోగించామని మిగతా వాహనదారులు కూడా ఈ పరికరాన్ని అమర్చుకోవాలని చెప్పారు.

ఇంటింటికీ వెళ్లి కుల గణన చేయాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో ఈ నెల 27 నుంచి ఇంటింటికి వెళ్లి కుల గణన చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో కుల గణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వందేళ్ల తర్వాత కుల గణన జరుగుతుందని, ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన చేయాలన్నారు. కుల గణన ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కుల గణనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, టిపిఆర్ఒ జగన్మోహన్, ఆర్ఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

బొబ్బిలి: ఈ నెల 23న బొబ్బిలి నియోజకవర్గంలో జరగబోయే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు బొబ్బిలి పురపాలక సంఘం ప్రజా ప్రతినిధులను, వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. పురపాలక సంఘం పరిధిలో గల 31వార్డుల ప్రజాప్రతినిధులు, వైసిపి ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సన్నద్ధత సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గోళగాన రమాదేవి, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

బొబ్బిలి: సీఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పేదలకు కార్పొరేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన బయోవియా కార్యశాల

నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన న్యూ డ్రగ్ అండ్ మెటీరియల్ డిస్కవరీ యూజింగ్ బయోవియా డిస్కవరి అండ్ మెటీరియల్ స్టుడియో అనే జాతీయ స్థాయి కార్యశాల గురువారంతో ముగిసింది. పర్యావరణానికి హాని కలుగకుండా గ్రీన్ టెక్నాలజీని సాధించడంలో డసాల్ట్ రూపొందించిన బయోవియో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సహకారంతో విద్యార్థులు ప్రయోగాలు చేపట్టారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పర్యవేక్షించారు. ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్ ఆచార్యులు, డాక్టర్ పౌలమి సిల్, కో కన్వీనర్లుగా సుధీర్ చౌదరి వ్యవహరించారు. ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, సెంచూరియన్ ఆంధ్రప్రదేశ్, భువనేశ్వర్, రాయగఢ, బోలాంగిర్, పర్లాకిమిడి, నర్సారావుపేట , సీతం ఇంజనీరింగ్ కళాశాల, సెయింట్ ఆన్స్ ఫార్మా, భాస్కర్ ఫార్మా, పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అవగాహన

వేపాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ లక్ష్యాలపై గురువారం ప్రిన్సిపల్ కిలపర్తి అప్పారావు అవగాహన కల్పించారు. విద్యార్థులు అనుసరించవలసిన అంశాలను విపులంగా వివరించారు. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా, సమాజం కోసం కూడా సేవా కార్యక్రమాలు చేపట్టాలని, నవ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి కె. పైడి బాబు, ఏ సాంబశివరావు, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిది

నెల్లిమర్ల: ఎంతో విలువైన బాలికల బాల్యాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ జిల్లా డైరెక్టర్ ఎం. ప్రసాదరావు అన్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ఆదిత్య విద్యాలయంలో అవగాహన కల్పించారు. కమ్యూనిటీ సోషల్ వర్కర్ సిహెచ్ నారాయణమ్మ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ 15 మండలాల పరిధిలో 150 గ్రామపంచాయతీలో బాల్య వివాహాలు విముక్త గ్రామాలుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనంతరం పాఠశాల హెచ్ఎం వి అమృత మాట్లాడుతూ బాలబాలికలు చట్టాలపై అవగాహన పెంచుకొని మెరుగైన సమాజ దిశగా ప్రయాణించాలని, విద్యార్థులకు పిలుపునిచ్చారు.

26న రాజ్యాంగ దినోత్సవ సభ

భోగాపురం: ఈ నెల 26వ తేదీన జరిగే భారత రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఎయిమ్ రాష్ట్ర నాయకులు బీ.వి. రమణ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముక్కు గణపతి, కో కన్వీనర్ అప్పారావు, సలహాదారు అప్పలకొండ, అప్పారావు, దామోదర్, నేతల చక్రవర్తి, గౌరీ, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రపై అవగాహన

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా సెట్విజ్ సిఇఒ అవగాహన కల్పించారు. 18 గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు కార్యక్రమం నిర్వహణపై పల సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెట్విజ్ కోచ్ శ్రీనివాసరావు, మండల పంచాయతీ విస్తరణ అధికారి ఉమా, మండలంలో గల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల పిఇటిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే ఇంటికే

ప్రజాశక్తి - వేపాడ

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే ఇంటికే పరిమితమవుతారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని జాకేరు గ్రామంలో గురువారం ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన సచివాలయం వద్దకు వచ్చేసరికి సిబ్బంది పూర్తిగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయాలని ఉద్యోగాలు ఇస్తే విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఆయన మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మిమ్మల్ని ఏం చేయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ఇకపై ఇలాగే ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంక్షేమ డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ మరల ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ సర్పంచ్ బుద్ధ చిన్నమ్ములు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమా, వైసిపి మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకటరావు, నాయకులు ఎం సత్యానారాయణ, ఎఎంసి చైర్‌పర్సన్ కస్తూరి, టీవీ రమణ, బుద్ధ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: సిబ్బందిని నిలదీస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

నెల్లిమర్ల : రాష్ట్రాభివృద్ధికి మరోసారి జగన్మోహన్‌రెడ్డిని సిఎంను చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కోరారు. గురువారం నగర పంచాయతీ పరిధి 8,9వార్డు, సచివాలయం-4లో పలు రకాల సంక్షేమ పథకాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్ మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అందవరపు సూరి బాబు, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, శంకరరావు, వైస్ చైర్ పర్సన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, బూర సుజాత, మొయిద శ్రీను, చిక్కాల సంతోష్, డైరెక్టర్ పాడ్రంకి మహాలక్ష్మి, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : మండంలోని పినతాడివాడలో జగనే మళ్లీ రాష్ట్రానికి ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 99శాతం నెరవేర్చారని కుటుంబంలో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందని చెప్పారు. అనంతరం సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ప్రారంభించి వైసిపి జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి ఆదిలక్ష్మి, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినగిరి అచ్చింనాయుడు, సర్పంచులు కోరాడ కనకరాజు, అట్టాడ శివ కృష్ణ, పలు శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మిలో గడప గడపకు..

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు, నియోజక వర్గ ఇంచార్జ్ అందవరపు సూరిబాబు పాల్గొని సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో జగనన్న ప్రభుత్వం అందజేసిన సంక్షేమ ఫలాల లబ్ధి వివరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఎగురవేసారు. అనంతరం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి ఆ కుటుంబం పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలోఎంపిపి అంబళ్ళ సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ళ శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమళ్ళ వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, నాయకులు మత్స సత్యనారాయణ, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీని వాస రావు, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

టిడిపి, జనసేన సమన్వయ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంతో పని చేసేందుకు టిడిపి, జనసేన సమన్వయ కమిటీ తీర్మానం చేసింది. స్థానిక గెస్ట్ హౌస్‌లో గురువారం టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, రాష్ట్ర కార్యదర్శి బాబు పాలూరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి ఐక్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన మద్దతుదారుల ఓట్లు తొలగింపును గుర్తించి అడ్డుకోవాలన్నారు. స్థానిక సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈ నెల 18,19న రోడ్ల దుస్థితిపై పోరాటం చేసేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంకాడ: టిడిపి, జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం ఆత్మీయ సమన్వయ కమిటీ సమావేశం మండలంలోని గంట్లం శ్రీశాంతి పేజ్-1లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రెండు పార్టీలు కలిపి గ్రామాల్లో జగన్మోహన్ రెడ్డి అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని తీర్మానించాయి. టిడివి, జనసేన పార్టీల నాయకులు కలిసికట్టుగా ముందుకు వెళ్లి ఏ పార్టీకి టికెట్ ఇచ్చిన కలిసి కట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్, మహంతి శంకరరావు, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కరరావు, టిడిపి నాయకులు పతివాడ అప్పల నారయణ, ఆకిరి ప్రసాద్, గేదెల రాజారావు, జనసేన నియోజకవర్గం ఇంచార్జి లోకం మాధవి, జనసేన మహిళా అధ్యక్షులు తుమ్మి లక్ష్మీ రాజ్, క్లస్టర్ ఇంఛార్జిలు అట్టాడ శ్రీధర్, దంగా భూలోకం, లోకం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: అన్ని వర్గాల ప్రజలనూ ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్రంలోని జగన్ పాలనకు త్వరలోనే ముగింపు పడనుందని టిడిపి చీపురపల్లి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. గురువారం చీపురుపల్లి టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి- జనసేన ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఏ ఒక్కరికీ మేలు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాస రావు, రౌతు కృష్ణ వేణి, యడ్ల సంతోష్, తుమ్మ గంటి సూరినాయుడు, రేగిడి లక్ష్మణరావు, సాసుబిల్లి రామునాయుడు, ఎచర్ల లక్ష్మి నాయుడు, సిగ తవిటి నాయుడు, టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, తాడ్డే సన్యాసి నాయుడు, చనమల మహేశ్వర రావు, బలగం వెంకట రావు, ముల్లు రమణ, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: సమావేశంలో మాట్లాడుతున్న బేబినాయన

పోరాట యోధుల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- డెంకాడ

56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు సేవలను గ్రంథాలయాధికారి మహేష్ వివరించారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చేసిన గ్రంథాలయ ఉద్యమాలు గురించి పాఠకులకు వివరించారు.

శృంగవరపుకోట: విజ్ఞానం ద్వారానే యువతకు భవిత ఏర్పడుతుందని శాఖా గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం గ్రంథాలయ ఉద్యమకర్తలు పాతూరు నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్. రంగనాథన్‌లను స్మరిస్తూ వారి జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ మల్లేశ్వరరావు, బొడ్డవర స్కూల్ టీచర్ ఎస్. శ్రీదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నవంబర్ 14వ తేదిన చిల్డ్రన్ డే సందర్భంగా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రోజూవారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. గురువారం గ్రంథాలయ ఉద్యమ నేతలు ఎస్ఆర్ రంగనాధన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమయ్య, గాడిచర్ల హరివొత్తరావు మొదలగు ప్రముఖుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాలర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు పి. నాగేశ్వరావు మాట్లాడుతూ ఎంతో మంది త్యాగ దనుల ఫలితమే ఈ గ్రంథాలయాలు అన్నారు. గ్రంథాలయ ఉద్యమం విశిష్టతను విద్యార్థులకు వివరించారు.


పూసపాటిరేగ: ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సాంకేతిక పరిజ్ఞానంతో సేవలు

ప్రజాశక్తి- విజయనగరం

ఖాతాదారులకు అధునాతన సాంకేతిక పద్ధతిలో విశిష్ట సేవలను కనకమహాలక్ష్మి ఆపరేటివ్ బ్యాంకు అందిస్తుందని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. ఖాతాదారులు ఆదరణ, అభిమానంతో రానున్న కాలంలో బ్యాంకును మరింత అభివృద్ధి దిశలో తీసుకువెళ్తామన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా విజయనగరం బ్యాంకు శాఖ ఆవరణలో గురువారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25 వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికే వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం 7 మంది సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 17,288 మంది సభ్యులతో రూ.31 కోట్లు వాటా ధనము పొంది అర్బన్ కోఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. సాంకేతికపరంగా కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా కోఆపరేటివ్ రంగంలో ఖాతాదారులకు సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్ పాల్గొన్నారు.


చైర్మన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గురువారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన అండర్-17 ఫుట్ బాల్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి వి హరిబాబు జట్టు రన్నర్‌గా నిలిచింది. తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అండర్-19 ఈత పోటీల్లో పాఠశాలకు చెందిన జి.సంతోష్, ఎన్.కుమార్, యు.చరణ్, వై.మణికంఠ, కె.అజయ్ కుమార్, టి.రమణ, ఎస్.పవన్ కుమార్ పాల్గొని సత్తా చాటారు. త్రోబాల్ అండర్-19 విభాగంలో ఎన్.పూర్ణచంద్ర రెడ్డి, ఫుట్ బాల్ అండర్-14 విభాగంలో ఎం.హర్షవర్ధన్ నాయుడు కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్ఎం సిహెచ్.ఆనందమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీల పాత్రో, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


వేపాడ: క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్

గురుకుల పాఠశాల విద్యార్థుల క్రీడా ప్రగతి

వేపాడ: స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన అండర్ -19 అథ్లెటిక్స్‌లో గురుకుల పాఠశాల విద్యార్థులు విజయ కేతనం ఎగరవేశారు. పాఠశాల విదార్థులు నీహారిక 3 కిలోమీటర్ల పరుగులో మొదటి బహుమతి సాధించగా, కీర్తి 3 కిలోమీటర్ల వాక్ రేస్‌లో మొదటి బహుమతి, శిరీష జావిలన్ త్రోలో మొదటి బహుమతి సాధించగా, జానకి డిస్కో త్రో లో మొదటి బహుమతి సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని, వీరికి శిక్షణ ఇచ్చిన పిఇటి అరుణ, పీడీ ఆదిలక్ష్మినీ ఆమె గురువారం అభినందించారు.


డెంకాడ: క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సంధ్యారాణి

డెంకాడ: మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల పిఠాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. బూర్లి మనోజ్‌కుమార్, మామిడి గుణసందీప్ పాల్గొని ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన పీడీ ఎన్ వరహాలను, విద్యార్థులను ప్రిన్సిపల్ సంధ్యారాణి గురువారం అభినందించారు.

రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి

శృంగవరపుకోట: జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్ళిపోయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల భవిష్యత్ మారాలంటే కేవలం చంద్రబాబు వల్లనే సాధ్యమవుతుందన్నారు. 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి దిశగా చంద్రబాబు పరుగులు పెట్టిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామ సత్యం, గోగాడ సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

పేద విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పేద విద్యార్థులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ గురువారం యూనిఫామ్‌లను అందజేశారు. పట్టణంలోని గాయత్రి గుడి వెనుకల గల టిడిపి కార్యాలయంలో పట్టణానికి చెందిన ఆర్‌కె. ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తును తీర్చిదిద్దేది చదువు ఒక్కటేనని మంచి విలువలతో కూడిన విద్య మన ఆర్థిక స్థితిగతులను మార్చుతుందని చెప్పారు. రానున్న కాలంలో ఇప్పుడున్న మీ తల్లిదండ్రుల తరానికి భవిష్యత్ తరానికి మధ్య వారధి మీరేనని గుర్తు చేశారు. చక్కగా చదువుకుని మీ ఇంటికి ఆర్థిక సారిధి కావాలని సూచించారు. చదువుతో పాటు వివిధ రకాల నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ అండ్ ఐటీ స్కిల్స్, క్రీడల్లో కూడా రాణించి మీ స్థాయిని పెంపొందించుకోవాలని సూచించారు. ఎటువంటి చెడు అలవాట్లకీ లోను కాకుండా కాలాన్ని వృథా చేయకుండా ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం త్వరలో కెరియర్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తానని అన్నారు. అనంతరం ఆర్‌కె ఎడ్యుకేషనల్ సర్వీసెస్ గుర్తించిన 54 మంది నిరుపేద విద్యార్థులకు గొంప కృష్ణ ఆర్థిక సహాయంతో ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల చొప్పున 108 జతలు యూనిఫారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామి, కొత్తవలస టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, గొరపల్లి రాము, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, బాణాది ఎంపిటిసి గొంప తులసి, టిడిపి నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, రామసత్యం, ఎస్ కోట పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షులు మాదిబోయిన మంగరాజు, గొర్లి నాగరాజు, సేనాపతి గణేష్, పాల్గొన్నారు.

మరుపల్లిలో అగ్నిప్రమాదం

- నాలుగు పురిళ్లు దగ్ధం
- రూ.9.5లక్షల ఆస్తినష్టం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ శివారు మరుపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నాలుగు పురిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 9.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, మరో సుమారు రూ.20లక్షల ఆస్థి నష్టాన్ని నివారించగలిగామని ఎస్.కోట అగ్నిమాపక కేంద్రం అధికారి మదీనా వెల్లడించారు. సోకుల కొండమ్మ ఇంట్లో దాచుకున్న రూ.5లక్షల నగదు, 2తులాల బంగారం, డాక్యుమెంట్లు, ఫ్రిడ్జ్, కరెంట్ మీటర్, గ్యాస్ స్టవ్, బట్టలు, వస్తు సామాగ్రి, దూరి ఎండం నాయుడు ఇంట్లో రూ.40వేల నగదు, టీవీ, గ్యాస్, మంచం, డాక్యుమెంట్లు, చింతల మల్లేష్ ఇంట్లో రూ.40వేల నగదు, కరెంట్ మీటర్, గ్యాస్, ఇతర వస్తు సామాగ్రి, పునకాల దుర్గారావు ఇంట్లో విలువైన ధ్రువీకరణ పత్రాలు కాలిబూడిదయ్యాయని ఆయన వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగి మంటలను అదుపు చేయటంతో మరింత ముప్పు తప్పిందని చెప్పారు. కాగా జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా కట్టుబట్టలతో మిగిలామని, ప్రభుత్వం, తక్షణం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బాధితులకు గొంప కృష్ణ ఆర్థిక సాయం

అగ్ని ప్రమాద బాధితులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంపై ఆరా తీశారు. బాధిత ఒక్కొక్క కుటుంబానికి రూ. 4వేలు, రైస్ బ్యాగ్, 2 బెడ్ షీట్స్‌లను తక్షణ ఆర్థిక సహాయం కింద అందించారు. టిడిపి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తుందని బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కాంలో అగ్నిప్రమాదం

భోగాపురం: మండలంలోని ముక్కాంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు కాలిపోయింది. స్థానికులు సకాలంలో స్పందించి మంటలార్పడంతో పెను ప్రమాదం తప్పింది. మైలపల్లి రామకు చెందిన పూరి గుడిసెలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు. సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. తహశీల్దార్ బంగార్రాజు ఆదేశం మేరకు విఆర్ఒ శ్రీలక్ష్మి ఆస్తి నష్టం అంచనా వేశారు.

రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదు : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి- మెరకముడిదాం

రాష్ట్రంలో ప్రతి పక్ష పార్టీ గాని, ప్రతి పక్ష నాయకుడు గాని లేరని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని గర్భాం పంచాయతీలో సచివాలయం -1, రైతు భరోసా కేంద్రాలను ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.371 కోట్ల ప్రజాధనాన్ని అవినీతి చేసి చంద్రబాబు జైలు పాలయ్యారన్నారు. ఈ నాలుగున్నారేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వంలో గర్భాం పంచాయతీకి రూ.56కోట్లు సంక్షేమ పథకాలు అందించామన్నారు. గ్రామంలో 361 ఇల్లులు ఇచ్చామని, 1200 పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. రూ. 3.5కోట్లతో గ్రామంలో త్వరలో ఇంటింటికీ తాగునీటిని అందిస్తామన్నారు. ఈ సంక్షేమ పథకాలు అందాలన్న, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా మళ్లి రాష్ట్రానికి జగన్ కావాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, సర్పంచ్ గాబ్రీలే, ఎస్‌వి రమణరాజు, సత్తారు జగన్ మోహనరావు, తాడ్డి చంద్రశేఖర్, బూర్లె నరేష్, పప్పల క్రిష్ణ మూర్తి, సత్తారు శ్రీను, వైస్ ఎంపిపి టి. హరిబాబు, జెసిఎస్ కన్వీనర్ ప్రసాద్ వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ప్రారంబిస్తున్న ఎంపి, జెడ్‌పి చైర్మన్